నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, శనివారం 3 ఫిబ్రవరి 2024 | BHADRADRI KOTHAGUDEM

## భద్రాద్రికి చేరుకున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

### బీఆర్‌ఎస్ పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశాల కోసం హాజరు



భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ) : మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు భద్రాద్రి జిల్లాలో శనివారం పర్యటించనున్నారు. భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో జరిగే బీఆర్‌ఎస్ పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశాల్లో ఆయన పాల్గొననున్నారు. ఆయనతోపాటు మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ కవిత, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు హాజరుకానున్నారు. కాగా శుక్రవారం రాత్రికే హరీశ్‌రావు సారపాక లోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. శనివారం ఉదయం భద్రాచలంలోని సీతారామచంద్రస్వామిని దర్శించుకోనున్నారు. అనంతరం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అధ్యక్షతన జరిగే మహబూబాబాద్ పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొననున్నారు. మధ్యాహ్నం పినపాక నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆధ్వర్యంలో మణుగూరులో నిర్వహించే సమావేశానికి, తరువాత కొత్తగూడెంలో మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశానికి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డితో కలిసి హాజరుకానున్నారు.

## పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం



పంచహారతుల కార్యక్రమంలో భక్తులు

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 2: మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య గల పెద్దమ్మతల్లి దేవాలయంలోని శ్రీకనకదుర్గ అమ్మవారికి అర్చకులు శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకాన్ని జరిపారు. ఆలయం ఎదురుగా ఉన్న అమ్మవారి జన్మస్థలం వద్ద ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి పసుపు, కుంకుమ, గాజులు, ఒడి బియ్యం సమర్పించారు. అనంతరం ఆలయం లోని మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం, పంచహారతులు, నివేదన, నీరాజన మంత్రపుష్పం పూజా కార్యక్రమాలు గావించారు. పంచహారతుల కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈవో రజనీకుమారి, ఆలయ కమిటీ అధ్యక్షుడు మహిపతి రామలింగం, ధర్మకర్తలు పాల్గొన్నారు




## పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధం చేస్తున్నాం

### విలేకర్ల సమావేశంలో ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్



మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): త్వరలో జరుగనున్న పార్లమెంట్, ఖమ్మం- వరంగల్- నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ జాబితాను సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లందరూ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఖమ్మం కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 1,456 పోలింగ్ కేంద్రాల పరిధిలోని 12,16,832 మంది ఓటర్లు ఉన్నారని, జాబితాలో సమ్మరీ రివిజన్‌లో భాగంగా ఒక్క నెలలో 23,124 చేర్పులు జరిగాయన్నారు. ఇదే జాబితాలో 20,435 మందిని వివిధ కారణాలతో ఓటర్లను తొలగించామన్నారు. జాబితాలో 18- 19 ఏళ్ల వయస్సు ఉన్న యువ ఓటర్లు 37,740 మంది ఉన్నారన్నారు. జాబితాలో అభ్యంతరాలపై త్వరలో అన్ని రాజకీయ పార్టీల నుంచి సూచనలను తీసుకుంటామని, పార్టీల ఫిర్యాదులు, అభ్యంతరాలను పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రులందరూ ఈనెల 6లోపు ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 2021లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికకు జిల్లానుంచి 87,172 మంది ఓటు హక్కు పొందారని, త్వరలో జరిగే ఎన్నికకు ఇప్పటివరకు 53,464 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఓటు నమోదుకు 31 అక్టోబర్ 2020 నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఈ నెల 24న ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితాను ప్రకటిస్తామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికకు జిల్లాలో 107 పోలింగ్ కేంద్రాలు కేటాయిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, డీపీఆర్‌వో ఎండీ గౌస్ పాల్గొన్నారు.







## కేఆర్‌ఎంబీకి కృష్ణా ప్రాజెక్టుల అప్పగింతతో తెలంగాణకు తీవ్ర నష్టం

- ఢిల్లీలో బీఆర్‌ఎస్ ఎంపీల నిరసన
- కేంద్ర జలశక్తిశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ దృష్టికి సమస్య

ఖమ్మం, ఫిబ్రవరి 2: కృష్ణా పరిధిలోని రెండు కీలక ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జున సాగర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం (కేఆర్‌ఎంబీ)కి అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఎంపీ నామా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంపీలు జి.రంజిత్ రెడ్డి, బి.వెంకటేష్, బి.లింగయ్య యాదవ్, ఆర్.సురేష్‌రెడ్డి శుక్రవారం ఢిల్లీలో నిరసన చేపట్టారు. ఈ మేరకు కేంద్ర జలశక్తిశాఖ కార్యాలయానికి వెళ్లి ఆ శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసి తమ అభ్యంతరాలను తెలిపారు. తెలంగాణలోని ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగించడమంటే ప్రజలను మోసగించినట్లేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ఇక్కడి రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ప్రాజెక్టుల అప్పగింత అంశాలను పార్లమెంట్ సమావేశాల్లో చర్చకు తీసుకువస్తామన్నారు. కృష్ణా ట్రిబ్యునల్‌లో విచారణ పూర్తయ్యేవరకు రెండు తెలుగు రాష్ట్రాలకూ 50:50 పద్ధతిలో నీటి కేటాయింపులు ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం ప్రజల అభిప్రాయాలకు విరుద్ధంగా ఉందన్నారు. ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగించడానికి ఆపరేషనల్ ప్రొటోకాల్ ఖరారు చేయాలని, నీటి వాటాలు తేల్చాలని ఇప్పటికే గత ప్రభుత్వం నాడు కేంద్రానికి లేఖ రాసిందని గుర్తు చేశారు. విద్యుత్ ప్రాజక్టులను భౌగోళిక పద్ధతుల ద్వారా నియంత్రించాలని పట్టుబట్టామన్నారు.




## క్రమశిక్షణ, సమయపాలన ఎంతో ముఖ్యం

### మొబలైజేషన్ ముగింపు కార్యక్రమంలో సీపీ సునీల్‌దత్



శిక్షణ పొందిన ఏఆర్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న సీపీ సునీల్‌దత్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 2: పోలీసు శాఖలో విధులు నిర్వహించే సిబ్బందికి వ్యక్తిగత క్రమశిక్షణ, సమయపాలన ఎంతో ముఖ్యమని సీపీ సునీల్‌దత్ పేర్కొన్నారు. సిటీ ఏఆర్ సిబ్బంది 15 రోజుల మొబలైజేషన్ ముగింపు కార్యక్రమంలో భాగంగా పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన పరేడ్‌లో ఆయన మాట్లాడారు. శాంతి భద్రతల సమస్య తలెత్తినప్పుడు సహాయకారిగా ఉండే ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ విభాగానికి సమస్య నిలువరించే సమయస్ఫూర్తి ఉండాలని అన్నారు. సిబ్బందికి శారీరక వ్యాయామం, ఆయుధాల పనితీరు, ఉపయోగాలు, స్క్వార్డ్ డ్రిల్ మొదలైన అంశాలపై 15 రోజులుగా ఏఆర్ పరేడ్ గ్రౌండ్‌లో శిక్షణ ఇచ్చామన్నారు. దీని ద్వారా సిబ్బందిలో క్రమశిక్షణ భరితమైన విధినిర్వహణను అలవర్చుకొని ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ సందర్భంగా సిబ్బందితో నేరుగా చర్చిస్తూ శాఖాపరమైన సమస్యల గురించి తెలుసుకుంటామన్నారు. కాగా, ఫైరింగ్ ప్రాక్టీస్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన సిబ్బందికి సీపీ సునీల్‌దత్ జ్ఞాపికను అందజేశారు. ఏడీసీపీలు, ఏసీపీలు ప్రసాద్‌రావు, కుమారస్వామి, నర్సయ్య, సుశీల్‌సింగ్, ఆర్‌ఐలు కామరాజు, శ్రీశైలం, సురేశ్, తిరుపతి, అప్పలనాయుడు పాల్గొన్నారు.

### బాలల భవిష్యత్తు కోసం నిరంతర కృషి

బాలలకు బంగారు భవిష్యత్తు అందించాలనే లక్ష్యంతో తమ శాఖ నిరంతరం కృషిచేస్తోందని సీపీ పేర్కొన్నారు. బాల కార్మికులకు విముక్తి కల్పించేందుకు, తప్పిపోయిన చిన్నారుల ఆచూకీ కనుగొనేందుకు ఏటా 'ఆపరేషన్ స్మైల్', 'ఆపరేషన్ ముస్కాన్' కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఇందులో భాగంగా మహిళా, శిశు సంక్షేమ, పోలీసు, కార్మిక, శిశు సంరక్షణ శాఖల అధికారులతో కూడిన కమిటీల ఆధ్వర్యంలో జనవరిలో జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో 70 మంది బాలబాలికలకు విముక్తి కల్పించామని, వారిని వారి తల్లిదండ్రులకు అప్పగించామని తెలిపారు.













